సాక్షి
వికారాబాద్

సోమవారం । 12 । జూన్ । 2023



తనిఖీలు నామమాత్రం

సీడ్స్ దుకాణాల్లో అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను ముంచుతున్నారు. 8లో▸



దడపుట్టిస్తున్న రోడ్లు..

బషీరాబాద్ మండలంలోని ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్ల మలుపులు ప్రయాణికులకు దడ పుట్టిస్తున్నాయి. 8లో▸



నిర్వహణ నిల్..

విద్యుత్ సరఫరాకు గుండెకాయ వంటి సబ్ స్టేషన్‌లో నిర్వహణ లోపించి సమస్యలు తలెత్తుతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

నియోజకవర్గ కేంద్రాల్లో 2కే రన్ నేడు

అనంతగిరి: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ పట్టణాల్లో సోమవారం 2కే రన్ నిర్వహించనున్నట్లు ఎస్పీ కోటిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నిచోట్లా ఉదయం 6గంటలకు ఈ పోటీ ప్రారంభమవుతుందని తెలిపారు. యువతీయువకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గురుకులాల్లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

మొయినాబాద్: సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 5వ తరగతిలో మొదటి లిస్టులో సీట్లు పొందిన విద్యార్థుల ప్రవేశాలకు ఈ నెల 15 వరకు గడువు పొడిగించినట్లు రంగారెడ్డి, హైదరాబాద్ ప్రాంతీయ సమన్వయాధికారి శారద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమకు కేటాయించిన గురుకులాల్లో 15వ తేదీలోగా చేరాలని సూచించారు.

దోస్త్ హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం దోస్త్ హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆదివారం కళాశాల ప్రిన్సిపాల్ కమల పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకునేటప్పుడు సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం దోస్తు హెల్ప్ లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కేంద్రం కోఆర్డినేటర్‌గా డాక్టర్ ఎస్.రవీందర్‌రెడ్డి నియమించినట్లు తెలిపారు. డిగ్రీ ప్రవేశాల కోసం ప్రయత్నించే విద్యార్థులు కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలు కల్పించినట్టు తెలిపారు.

పాలమూరును ముక్కలు చేసిన పాపం కేసీఆర్‌దే

పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రాఘవాచారి

షాద్‌నగర్: పాలమూరు జిల్లాను ముక్కలుగా చేసిన పాపం సీఎం కేసీఆర్‌దేనని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రాఘవాచారి అన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం షాద్‌నగర్‌లో చేపట్టిన రిలేనిరాహార దీక్షలు ఆదివారంతో ముగిసాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాఘవాచారి మాట్లాడుతూ.. వ్యూహాత్మకంగానే షాద్‌నగర్‌ను పాలమూరు నుంచి విడదీసి రంగారెడ్డి జిల్లాలో కలిపారని విమర్శించారు. చినజీయర్, జూపల్లి రామేశ్వర్‌రావుకు లబ్ధి చేకూర్చేందుకే కొంగరకొలాన్‌లో కలెక్టరేట్ నిర్మించారని ఆరోపించారు. పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా జిల్లేడు చౌదరిగూడ మండలంలో నిర్మించ తలపెట్టిన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వలేదని అన్నారు. రిజర్వాయర్ నిర్మాణం పూర్తయ్యేంత వరకు పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్, వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇబ్రహీం, ఎస్.రాజు, దొడ్డి శ్రీనివాస్, తుప్పుడు నర్సయ్య, అర్జునప్ప, తిరుమలయ్య, టీజీ శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి సీనియర్ బ్యాడ్మింటన్ పోటీలు

మలక్‌పేట: రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (ఎస్ఏటీఎస్) సంయుక్తాధ్వర్యంలో 9వ, యోనెక్స్ సన్‌రైజ్ తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కరెడ్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 22 నుంచి 24 వరకు రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా గ్రామంలోని కన్హా శాంతి వనంలో జరుగుతాయని తెలిపారు. పురుషులు, మహిళల విభాగాల్లో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ పోటీలు ఉంటాయన్నారు. ఇవి జాతీయ స్థాయి, మహిళలు, పురుషుల బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక పోటీలన్నారు.

3,400 మంది హాజరు

- ప్రశాంతంగా గ్రూప్– 1 ప్రిలిమినరీ
- పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు



సెంటర్‌లోకి పరుగు పెడుతున్న అభ్యర్థి

అనంతగిరి: వికారాబాద్‌లో ఆదివారం నిర్వహించిన గ్రూప్– 1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమైన ఎగ్జామ్ మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగింది. ఉదయం 8గంటల వరకే అభ్యర్థులు సెంటర్లకు చేరుకున్నారు. 8:30 నుంచి వీరినిలోనికి అనుమతించారు. మెటల్ డిటెక్టర్‌తో క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే హాల్‌లోకి పంపించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన 15 సెంటర్లలో 4,857 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 3,400 మంది హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. కలెక్టర్ నారాయణరెడ్డి పలు సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, సిద్ధార్థ కాలేజీల్లో ఎగ్జామ్ సెంటర్లను పరిశీలించారు. కేంద్రాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటును పరిశీలించారు. ఆయన వెంట అధికారులు నిర్వహణ అధికారి రమేశ్, విద్యాశాఖ ఏడీ అబ్దుల్ ఘని తదితరులు ఉన్నారు.



వికారాబాద్‌లో విద్యార్థిని ఆన్సర్ షీట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

సమస్యల ఒరబడి!

వేసవి సెలవులు ముగిశాయి. నేటి నుంచి మళ్లీ బడిగంట మోగనుంది. ఎప్పటిలాగే ఈసారి కూడా సర్కారు బడుల విద్యార్థులకు సమస్యలే స్వాగతం పలకనున్నాయి. 'మన ఊరు– మన బడి' పేరుతో ప్రభుత్వం హడావుడి చేసినా.. మెజార్టీ స్కూళ్లలో వసతుల కల్పన పనులు పూర్తికాలేదు.

నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం

- వెక్కిరిస్తున్న వసతుల కల్పన
- మొక్కుబడిగానే 'మన ఊరు– మన బడి'



కుల్కచర్ల మండలం మరికల్‌లో పిల్లర్ల స్థాయిలోనే మన ఊరు మనబడి పనులు

పరిగి: ఎండాకాలం సెలవుల నేపథ్యంలో సుమారు యాభై రోజుల పాటు ఆటపాటలతో సందడి చేసిన విద్యార్థులు సోమవారం నుంచి బడి బాట పట్టనున్నారు. ఆటలకు బైబై చెప్పి.. పాఠాలు నేర్చుకునేందుకు సిద్ధమయ్యారు. గత ఏప్రిల్ 24న అటకెక్కించిన పుస్తకాల సంచిని కిందికి దించారు. హాలీ డేస్ సందర్భంగా సొంత ఊళ్లు, అమ్మమ్మ, తాతమ్మ వద్దకు వెళ్లిన వారు ఆదివారం స్వస్థలాలకు చేరుకోవడం కనిపించింది.

20న ప్రారంభోత్సవాలు

జిల్లాలో మొత్తం 1,063 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 371 స్కూళ్లను మనఊరు మన బడి పథకం కింద ఎంపిక చేశారు. వీటిలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు పనులు ప్రారంభించగా.. కేవలం 23 స్కూళ్లలో మాత్రమే పూర్తయ్యాయి. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20న విద్యా దినోత్సవం నిర్వహించనున్నారు. అప్పటివరకైనా పనులు పూర్తిచేస్తారో.. లేదో వేచిచూడాల్సిందే. ఇప్పటికే పూర్తయిన పనులను ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా 20న ప్రారంభించే అవకాశం ఉంది. జిల్లాలోని సుమారు తొంభై వేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇదే రోజున పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు సమాచారం.

మెరుగైన ఫలితాలే లక్ష్యంగా..

పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించి, కార్పొరేట్‌కు దీటుగా సిద్ధం చేయాలని ప్రభుత్వం భావించింది. ప్రశాంత వాతావరణం కల్పించి మెరుగైన ఫలితాలు రాబట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా అధికారులు మొదటి విడత కింద 371 స్కూళ్లను ఎంపిక చేశారు. పాఠశాలలు తెరిచే నాటికి (జూన్ 12) పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. కానీ ఇప్పటి వరకు కేవలం 23 పాఠశాలల్లోనే నిర్మాణ పనులు పూర్తయ్యాయి. భవనాలకు రంగులు వేయడం, మంచినీటి సౌకర్యం, ఫ్యాన్లు, టేబుళ్లు, కుర్చీలు సమకూర్చడం వంటివి పూర్తి చేశారు. మిగిలిన స్కూళ్లలో చేపట్టిన పనులు ఇప్పట్లో పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదు.

స్కూళ్లలోనే ధాన్యం

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు.. సేకరించిన ధాన్యం బస్తాలు వర్షానికి తడవకుండా పాఠశాలల్లో నిల్వ చేయించారు. ఇప్పటికే మిల్లులు నిండిపోవడంతో స్కూళ్లలోని ధాన్యం తరలింపు ప్రక్రియ ముందుకు కదలడం లేదు. దీంతో స్కూళ్లకు వచ్చే విద్యార్థులు ఎక్కడ కూర్చోవాలో తెలియని పరిస్థితి నెలకొంది.

అన్ని ఏర్పాట్లు చేశాం



పాఠశాలల పునఃప్రారంభానికి అన్ని ఏర్పాట్లు చేశాం. విద్యార్థులు వచ్చిన మొదటి రోజే పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తాం. మన ఊరు మన బడి కింద చేపట్టిన పనులు 23 స్కూళ్లలో ఇప్పటికే పూర్తయ్యాయి. మిగిలినవి కొనసాగుతున్నాయి. త్వరలోనే పూర్తి చేసి సౌకర్యాలు కల్పిస్తాం.

– రేణుకాదేవి, జిల్లా విద్యాధికారి

విభజించి.. పని పంచి



తాండూరులో జాతీయ రహదారుల శాఖ కార్యాలయం బోర్డు



వికారాబాద్‌లో భవనాల శాఖ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

- ఆర్అండ్‌బీకి తప్పనున్న పని భారం
- ప్రత్యేకంగా భవనాల శాఖ ఏర్పాటు
- అందుబాటులోకి రహదారుల శాఖ కొత్త ఆఫీసులు
- రోడ్లు, భవనాల పనులపై పెరగనున్న పర్యవేక్షణ

తాండూరు: సీఎం కేసీఆర్ ప్రభుత్వం రెండోసారి కొలువుదీరిన తర్వాత అభివృద్ధి పనులకు పెద్ద పీట వేసింది. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో పాలనా సౌలభ్యాన్ని విస్తృతం చేస్తోంది. ఇందులో భాగంగా రోడ్లు, భవనాల శాఖ (ఆర్అండ్‌బీ)ను వేరుచేస్తూ భవనాల శాఖగా మార్పు చేసింది. దీంతో జిల్లాలో ఆ శాఖ కార్యాలయాలు ఏర్పా టు కానున్నాయి. మొదటగా జిల్లా కేంద్రంలో వికారాబాద్ సబ్ డివిజన్ ఆఫీసు ప్రారంభమైంది.

పర్యవేక్షణ సులువయ్యేలా..

పునర్విభజన తర్వాత కొత్త జిల్లాలకు ప్రభుత్వ భవనాల ఆవశ్యకత ఎక్కువైంది. గ్రామీణ ప్రాంతంగా ఉన్న వికారాబాద్ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు సర్కారు చర్యలు చేపట్టింది. పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు పర్యవేక్షణ సులభమయ్యేలా ఆర్అండ్‌బీని పునర్ వ్యవస్థీకరించింది. వీటి నిర్వహణకు వేర్వేరుగా సబ్ డివిజన్ కార్యాలయాలను ఏర్పాటు చేస్తోంది. రెండు రోజుల క్రితమే వికారాబాద్ సబ్ డివిజన్ ఆఫీస్ అందుబాటులోకి వచ్చింది. స్థానిక ఆర్అండ్‌బీ డీఈఈ వెంకటేశంకు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. మిగిలిన సబ్ డివిజన్ కార్యాలయాలు త్వరలోనే అందుబాటులోకి తెచ్చేందుకు ఉన్నతాధికారులు దృష్టిసారించారు.

తగ్గిన పని భారం

నిన్నమొన్నటి వరకు ఆర్అండ్‌బీ శాఖ అధికారులు పనిభారంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈనేపథ్యంలో కొంతమంది అనారోగ్యం బారిన పడి ఆస్పత్రుల పాలయ్యారు. జిల్లాకు ప్రభుత్వం పెద్ద ఎత్తున రోడ్లతో పాటు కొత్త భవనాలను మంజూరు చేసింది. ఈ పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. సర్కారు తీసుకున్న నిర్ణయంతో రెండు శాఖలుగా విడిపోయిన ఆర్అండ్‌బీ అధికారులకు పనిభారం తగ్గనుంది. ఇదే సమయంలో పనుల్లో జవాబుదారీతనం పెరిగే అవకాశం కలిగింది.

తాండూరులో రహదారుల కార్యాలయం

తాండూరులోని ఆర్అండ్‌బీ ఆఫీస్ ప్రాంగణంలోనే జాతీయ రహదారుల శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ కార్యాలయం(ఏఈ)కు ఒక గదిని కేటాయించారు. ఇక్కడ ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేశారు.

మీ పోరాటం మరువలేనిది



సన్మాన కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్

- సాహిత్య దినోత్సవంలో జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి
- కవులు, కళాకారులకు ఘనంగా సన్మానం

అనంతగిరి: కవులు, కళాకారులను గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం తెలంగాణ సాహిత్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. తెలంగాణ ఉద్యమంలో కవులు, కళాకారుల ప్రధాన భూమిక పోషించారన్నారు. అనంతరం పలువురిని ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ.. మట్టిలోని మాణిక్యాలను వెలుగులోకి తీసుకువచ్చే దిశగా సాహిత్య దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించుకోవడం గర్వంగా ఉందన్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యం వింటే చెవిలో తేనె పోసినట్లుగా ఉంటుందన్నారు. సమాజాన్ని జాగ్రుత పరిచేది కవులు, కళాకారులేనని తెలిపారు. జిల్లాలో పాల్గొన్న వచన కవితల సంకలాన్ని పుస్తక రూపంలో తీసుకువచ్చామన్నారు. ఉత్తమ రచనలను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లైబ్రరీ చైర్మన్ సుశీల్‌కుమార్ గౌడ్, డీఈఓ రేణుకాదేవి, డీఐఓ శంకర్‌నాయక్, ఎంపీపీ చంద్రకళ, గ్రంథాలయ కార్యదర్శి సురేష్, వికారాబాద్ ఎంపీడీఓ సత్తయ్య, కవులు, కళాకారులు, పలువురు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుకు.. అప్పుల తిప్పలు

- పత్తా లేని క్రాప్ లోన్ల పంపిణీ
- రైతుబంధు కోసం ఎడతెగని ఎదురు చూపులు
- దశాబ్ది వేడుకల్లో అధికారులు బిజీ
- సీజన్ ప్రారంభమై 15 రోజులైనా స్పందించని వైనం
- విత్తనాలు, ఎరువులకు కర్షకుల అవస్థలు



వికారాబాద్: పంట రుణం లేదు.. రైతుబంధు అందదు.. ఇదీ ప్రస్తుతం జిల్లా రైతుల పరిస్థితి.. పంట పెట్టుబడికి ఆధారమైన రుణాల ప్రక్రియను ఈసారి బ్యాంకర్లు ఇప్పటికీ ప్రారంభించలేదు. వానాకాలం సీజన్ ప్రారంభమై 15 రోజులు కావస్తున్నా.. ఆ ఊసే ఎత్తడం లేదు. ప్రభుత్వం రైతుబంధు రూపంలో అందించే ఎకరాకు రూ.5 వేల సాయం సైతం ఖాతాల్లో చేరలేదు. దీంతో పంటల సాగు కోసం రైతులు మళ్లీ దళారులు, వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. అసలు పంట రుణాలు ఇస్తారో..లేదో..? అనే విషయమై కర్షకులు అయోమయానికి గురవుతున్నారు.

లక్ష్యం రూ.3,829 కోట్లు

సాధారణంగా ఏటా వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందే బ్యాంకర్లు జిల్లాలో ఎంత మంది రైతులు ఉన్నారు..? ఎన్ని ఎకరాల సాగుభూమి ఉంది..? ఇవ్వాల్సిన రుణం ఎంత..? అనే విషయంలో ప్రణాళిక సిద్ధం చేస్తారు. ఈ ఏడాది కూడా ఇటీవల రుణ ప్రణాళిక విడుదల చేసిన బ్యాంకర్లు పంపిణీ మాట ఎత్తడం లేదు. జిల్లాలో 2.40 లక్షల మంది రైతులు ఉండగా వీరికి.. క్రాప్ లోన్ల కింద ఈ ఏడాది రూ.2,582 కోట్లు, ఇతర వ్యవసాయ రుణాల కింద రూ.1,247 కోట్లు.. మొత్తం రూ.3,829 కోట్లు ఇస్తామని ప్రకటించారు. ఇదిలా ఉండగా రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయటం ప్రారంభించి 15 రోజులు కావస్తున్నా ఎలాంటి స్పందన లేదు. రుణాల మంజూరు, వితరణ అంశాలను పరిశీలించాల్సిన ఉన్నతాధికారులు దశాబ్ది వేడుకల్లో బిజీగా ఉన్నారు.

5.90 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లావ్యాప్తంగా ప్రస్తుత సీజన్‌లో 5.90 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆయా పంటల రకాలను బట్టి ఒక్కో ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి అవసరం. ఈ లెక్కన ఏటా కమర్షియల్ బ్యాంకులైన ఎస్‌బీఐ, తెలంగాణ గ్రామీణ, ఆంధ్రా బ్యాంకులతో పాటు డీసీసీబీ కలిపి ఏటా సగటున రూ.3,829 కోట్ల రుణాలివ్వాలి. కానీ ఈరోజు వరకు రూపాయి కూడా మంజూరు చేయలేదు.

వెంటనే ఇవ్వాలి

ఏటా వానాకాలానికి ముందే పంట రుణాలు ఇచ్చేవారు. ఈసారి ఆ జాడే లేదు. బ్యాంకులకు వెళ్లి అడిగినా.. స్టార్ట్ కాలేదని చెబుతున్నారు. రైతుబంధు డబ్బులు కూడా రాలేదు. దీంతో పెట్టుబడి కోసం అప్పులు చేయక తప్పడం లేదు. బ్యాంకు సార్లు స్పందించి వెంటనే లోన్లు ఇవ్వాలి.

– కాశయ్య, రైతు, మల్లెపల్లి

కూలే వరకూ స్పందించరా..?

- కోట్‌పల్లిలో ప్రమాదకరంగా వాటర్ ట్యాంక్
- పెచ్చులూడి కింద పడుతున్న వైనం



శిథిలావస్థకు చేరిన ట్యాంకు

బంట్వారం: కోట్‌పల్లి మండల కేంద్రంలో నలభై ఏళ్ల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. ట్యాంక్ పెచ్చులు ఊడి కింద పడుతున్నాయి. ఇనుప చువ్వలు బయటకు తేలాయి. చాలా కాలంగా లీకేజీ కావడంతో నీరు కారుతూ నాచుపట్టింది. అయినప్పటికీ నిత్యం ఈ ట్యాంకు నుంచే నీటి సరఫరా చేయడం గమనార్హం. మొయిన్ రోడ్డు పక్కనే ఉన్న ట్యాంకు ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి ట్యాంకును కూల్చేసి.. కొత్తది నిర్మించాలని కోరుతున్నారు.

భయంభయంగా..



ట్యాంకు మా ఇంటి పక్కనే ఉండటంతో భయం భయంగా గడుపుతున్నాం. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఏ క్షణమైనా కూలిపోయే ప్రమాదముంది. ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. కలెక్టర్ గారైనా స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– ప్రభాకర్, స్థానికుడు

పాత రోడ్లకు పూతలు వేసి..!

- ఇష్టారాజ్యంగా సీసీ రోడ్ల నిర్మాణం
- పట్టించుకోని అధికారులు



బండపల్లిలో ఎన్‌డీఎఫ్ నిధులతో వేస్తున్న సీసీ రోడ్డు

పెద్దేముల్: గ్రామాల అభివృద్ధి ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు విడుదల చేస్తున్నా.. కొంత మంది అధికారులు, కాంట్రాక్టర్ల కారణంగా పనులు నాసిరకంగా కొనసాగుతున్నాయి. పూర్తి చేసిన పనులు మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోతున్నాయి. మండల పరిధిలోని పలు గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో ఏమాత్రం నాణ్యత పాటించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్‌డీఎఫ్ కింద బండపల్లి గ్రామానికి ప్రభుత్వం రూ.45 లక్షలకు పైగా నిధులు మంజూరు చేసింది. వీటితో నూతన సీసీ రోడ్లు నిర్మించాల్సి ఉండగా.. ఇప్పటికే ఉన్న రోడ్లపై సిమెంట్, కాంక్రీట్ వేసి చేతులు దులుపుకొంటున్నారు. పాత రోడ్లపై రెండు ఇంచుల మేర కొత్త సీసీ వేసి.. ఆరు ఇంచుల రోడ్లు నిర్మించినట్లు బిల్లులు చేస్తున్నారు. ఈ విషయమై పీఆర్ ఏఈ సిద్ధార్థను వివరణ కోరగా పాత సీసీ రోడ్లపై మళ్లీ సీసీ వేయడం సరికాదన్నారు. అలా చేసిన వారి బిల్లుల్లో కోత పెడతామని తెలిపారు.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్‌ పట్టివేత

పెద్దేముల్‌: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్‌ మండలం కందనెల్లి సమీపంలో ఆదివారం ఉదయం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్‌ఐ, ఏఎస్‌ఐ నారాయణ పట్టుకొని, కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

అక్రమంగా మట్టి తరలింపు



జేసీబీతో టిప్పర్లలో మట్టిని నింపుతూ..

పూడూరు: చన్గోముల్‌ గండ్ల మైసమ్మ ఆలయం సమీపంలో మట్టిని అక్రమంగా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం వస్తే చాలు మట్టి మాఫియా విజృంభిస్తోందని అంటున్నారు. రాత్రి సమయాల్లో గుట్టుగా టిప్పర్లలో మట్టిని తరలిస్తున్నారన్నారు. మండల పరిధిలోని ఫాంహౌస్‌లకు తరలిస్తున్నారని అన్నారు. ఎలాంటి అనుమతులు లేకున్నా గుట్టలను యథేచ్ఛగా తవ్వుతున్నారని తెలిపారు. పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామానికి చెందిన లింగప్ప, సుధాకర్‌గౌడ్‌, ముచుకుందం, నవీన్‌, శేఖర్‌, రమేశ్‌, నర్సింహులు, ఆనందం వాపోయారు.

జీతం డబ్బులు ఇవ్వలేదని..

కూలీ ఆత్మహత్య

పరిగి: ఆరోగ్యం బాగాలేదని, జీతం డబ్బులు ఇవ్వాలని కోరినా ఇవ్వనందుకు ఓ కూలీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పరిగి పట్టణ కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పశ్చిమబెంగాల్‌ రాష్ట్రం, కాజ్‌ గ్రామానికి చెందిన బిపాల్‌ హజ్ర (26) రెండేళ్లుగా పట్టణ కేంద్రంలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. 15 రోజులుగా ఆరోగ్యం బాగా లేకపోవడంతో పనికి వెళ్లలేదు. ఆస్పత్రికి వెళ్లినా ఆరోగ్యం నయంకాకపోవడంతో తాను పనిచేసిన హోటల్‌ యజమాని దగ్గరికి వెళ్లి జీతం డబ్బులు ఇవ్వాలని కోరాడు. ఎన్ని సార్లు అడిగినా ఇవ్వక పోవడంతో స్నేహితుడు సందీప్‌ బిస్వస్‌ దృష్టికి తెచ్చాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన బిపాల్‌ హజ్ర ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో తన స్నేహితుడు మృతికి హోటల్‌ యజమాని శ్రీకాంత్‌రెడ్డి, టెకేదార్‌ మొహతాప్‌ఖాన్‌లే కారణమని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేసీఆర్‌ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

కొడంగల్‌ : ముఖ్యమంత్రి కేసీఆర్‌ చిత్రపటానికి దివ్యాంగులు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేసీఆర్‌ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. దివ్యాంగుల పింఛన్‌ వెయ్యి రూపాయలు పెంచినందుకు ప్రభుత్వానికి రుణపడి ఉంటామని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ మధుసూదన్‌రావు యాదవ్‌, మాజీ సర్పంచు రమేశ్‌బాబు, దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు అనంతరాములు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అంజమ్మ, కార్యదర్శి మైమూదా, సెర్ప్‌ సీసీ గుమ్మిరాములు పాల్గొన్నారు.

15 మేక పిల్లలు మృతి

ఉప్పరిగూడలో ఘటన

ఇబ్రహీంపట్నం రూరల్‌: అనుమానాస్పద స్థితిలో మందలో ఉన్న 15 మేకపిల్లలు మృతి చెందాయి. ఈ ఘటన ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడలో ఆదివారం చోటు చేసుకుంది. మడుపు యాదయ్య వ్యవసాయ బావి వద్ద మేకల మంద ఉంచారు. ఆదివారం ఉదయం వెళ్లి చూసే సరికి 15 మేక పిల్లలు మృతి చెంది ఉన్నాయి. వెంటనే స్థానిక సర్పంచ్‌ రాంరెడ్డికి తెలిపడంతో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. పశుసంవర్ధక శాఖ అధికారులు సైతం వచ్చి ఆరా తీశారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి ఫోన్‌చేసి విషయ చెప్పగా బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

తనిఖీలు నామమాత్రం..
నకిలీ యథాతథం

మార్కెట్‌లో అనుమతిలేని విత్తనాలే అధికం

- గుట్టుగా విక్రయిస్తున్న వ్యాపారులు
- వానాకాలం సీజన్‌లో సింహభాగం పత్తి సాగే..



నకిలీ విత్తనాల వల్ల మిట్టకోడూర్‌లో పూతకాత లేకుండా ఏపుగా పెరిగిన పత్తి పంట (ఫైల్‌)

వికారాబాద్‌: ఫెర్టిలైజర్‌ దుకాణాదారుల అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఓ వైపు ఎరువులు విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను దోపిడీ చేస్తుండగా.. మరో వైపు అనుమతులు లేని విత్తనాల విక్రయాలకు తెరతీస్తున్నారు. సుమారు 20 రకాల కంపెనీలకు చెందిన పత్తి విత్తనాలకు ఎలాంటి అనుమతులు లేనట్లు తెలుస్తోంది. చాలా ఫెర్టిలైజర్‌ దుకాణాల్లో ఇదే తరహా తంతు కొనసాగిస్తూ రైతులను నట్టేట ముంచే ప్రయత్నం చేస్తున్నారు. అయితే అక్రమ విత్తనాలు దొరికిన ప్రతిసారి వ్యవసాయ శాఖ అధికారులు ఈ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. స్టాప్‌సేల్‌తో సరిపెడుతుండటం పలు ఆరోపణలకు తావిస్తోంది. ఐదారేళ్లుగా నకిలీ విత్తనాలు ఏదో ఒక గ్రామంలో రైతు కొంప ముంచుతూనే ఉన్నాయి. పంట ఏపుగా పెరిగినా పూత, కాత రాకుండా ఉండిపోతుండటం చూస్తూనే ఉన్నాం.

అంతా కుమ్మక్కు..

నకిలీ విత్తనాలు సైతం విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నా వ్యవసాయ శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. సీజన్‌ ఆరంభంలో పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహిస్తున్నప్పటికీ అందులో చిత్తశుద్ధి కనిపించడంలేదు. పోలీసులకు తనిఖీలు చేసే విషయంలో అవగాహన లేకపోవడంతో నకిలీ విత్తనాలు, అనుమతులు లేని విత్తనాలు గుర్తించే విషయంలో వ్యవసాయ శాఖ అధికారులపైనే ఆధారపడాల్సి వస్తోంది. అయితే వ్యవసాయ శాఖ అధికారులు స్థానిక డీలర్లు, ఫెర్టిలైజర్‌ దుకాణాదారులతో ఉండే సన్నిహితంతో అక్రమాలు బయటకు రానివ్వడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మెజార్టీ విత్తనాలది అదే పరిస్థితి

జిల్లాలో మొత్తం ఖరీఫ్‌లో 5.90 లక్షల ఎకరాల్లో ఆయా పంటలు సాగవుతాయని భావిస్తుండగా అత్యధికంగా పత్తి పంటనే సాగుచేస్తున్నారు. గతేడాది 2.40 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా ఈ ఏడాది 2.70 లక్షల ఎకరాలకు పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనావేస్తున్నారు. ప్రస్తుతం ఫెర్టిలైజర్‌ దుకాణాల్లో 20 నుంచి 30 రకాల పత్తి విత్తనాలు విక్రయిస్తున్నారు. అయితే ఏ కంపెనీ విత్తనాలు విక్రయించాలన్నా.. వ్యవసాయ శాఖ డైరెక్టర్‌ నుంచి మార్కెటింగ్‌ అనుమతులు (పీసీ సర్టిఫికెట్‌) పొందాల్సి ఉంటుంది. ఈ అనుమతులు విత్తన రకాలను బట్టి ఒక్కో రకం విత్తనానికి ప్రత్యేకంగా అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఇందులో ఒకటి రెండు కంపెనీలు మినహా మెజార్టీ రకాల విత్తనాలు సీడ్స్‌ అండ్‌ ఫెర్టిలైజర్‌ దుకాణాదారులు అనుమతులు లేకుండానే విక్రయిస్తున్నారు. ఈ విషయంలో తనిఖీల్లో పలు సార్లు వెలుగు చూసినా స్టాప్‌సేల్‌తో సరిపెట్టారు. కొద్ది రోజులకే అవి మళ్లీ విక్రయించారు.



దుకాణాల్లో విక్రయిస్తున్న పత్తి విత్తన ప్యాకెట్లు

ఐడియా భళా..

ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఐడియాకు అందరూ ఫిదా అవుతున్నారు.యాలాల మండల పరిధిలోని ముద్దాయిపేట ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మణ్‌ రోజు తాండూరు నుంచి రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఎండలు, వడగాలులు తీవ్రంగా ఉండటంతో బైక్‌పై షాడో కవర్‌ ఏర్పాటు చేశారు. వెనుకాల కూర్చున్న వ్యక్తికి సైతం నీడ వచ్చేలా అమర్చారు. బడిబాటలో భాగంగా గ్రామంలో ప్రచారానికి బైక్‌పై వచ్చిన ఉపాధ్యాయుడిని గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు. బైక్‌పై షాడో కవర్‌కు సుమారు రూ.8వేల ఖర్చు అయ్యిందని ఆయన తెలిపారు. – యాలాల



కళ తప్పిన కోట్‌పల్లి

- నో ఎంట్రీతో పర్యాటకుల పరేషాన్‌
- ఎన్నాళ్లు నిషేధం అంటూ మండిపాటు
- చిరువ్యాపారుల్లో సైతం అసహనం
- అధికార యంత్రాంగంలో సమన్వయలేమి



బోసిపోయి కనిపిస్తున్న ప్రాజెక్టు ప్రాంతం

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు కళతప్పింది. పర్యాటకులకు అనుమతి లేకపోవడంతో బోసిపోయి కనిపిస్తున్నది. ఆదివారం వచ్చిందంటే చాలు కుటుంబాలతో తరలివచ్చి రోజంత సేదతీరేవారు. పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ సందడి చేసేవారు. ఫలితంగా ప్రాజెక్టు అంతా పర్యాటకులతో కళకళలాడేది. ప్రస్తుతం ఎటు చూసినా మట్టి దిబ్బలు, వెలవెలబోతున్న పరిసరాలే దర్శనమిస్తున్నాయి. గత జనవరి 16న పూడూరు మండల పరిధిలోని మన్నెగూడకు చెందిన ఒకే కుటుంబంలోని నలుగురు యువకులు ఈత కోసం ప్రాజెక్టు నీటిలో దిగి మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఇరిగేషన్‌, రెవెన్యూ, అటవీశాఖ, పోలీసు యంత్రాంగం ప్రాజెక్టు పరిసరాలకు ఎవరూ వెళ్లకుండా నిషేధించారు. ప్రాజెక్టు వద్ద కొనసాగుతున్న కాయకింగ్‌ బోటింగ్‌ సైతం ప్రాజెక్టు అవతలి వైపునకు తరలించారు. ఐదు నెలల గడిచినా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు.. పర్యాటకులను అనుమతించడంలేదు.

ఉపాధి కోల్పోయాం

కోట్‌పల్లి ప్రాజెక్టుకు నిత్యం వచ్చే పర్యాటకులకు చిరు పదార్థాలను, కూల్‌డ్రింక్స్‌, చెరుకు రసం తదితర వాటిని విక్రయించి వచ్చిన లాభంతో తమ కుటుంబాలను పోషించుకునే వారమని చిరువ్యాపారులు తెలిపారు. కాయకింగ్‌ బోటింగ్‌ సంస్థలో పనిచేయడం వలన నెలనెలా జీతాలు అందేవని, బోటింగ్‌ లేక వీధిన పడ్డామని సిబ్బంది తెలిపారు. ఇటీవల ప్రాజెక్టును కలెక్టర్‌ సందర్శించినప్పుడు తమ బాధలు తెలిపినట్లు చెప్పారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్‌ త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారన్నారు. అయినా ఇంత వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోవడంలేదని వారు వాపోయారు.

అలరించిన నాట్యప్రదర్శనలు



మాదాపూర్‌లోని శిల్పారామంలో భరత నాట్య ప్రదర్శన

గచ్చిబౌలి: మాదాపూర్‌లోని శిల్పారామంలో నాట్య ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా అలరించాయి. వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 'శ్రీకృష్ణ కళ లయ' బెంగళూరు గురువు సునీతా సుకుమారన్‌ శిష్యబృందంచే నిర్వహించిన భరత నాట్య ప్రదర్శన ఆద్యంతం కట్టిపడేసింది. పుష్పాంజలి, గణేశకీర్తన, నాతనం మనోహర, పాహిమాం, నటేశకౌతం, త్రిమాత, వర్ణం, థిల్లాన తదితర అంశాలను నాట్య కళాకారులు చైత్ర కీర్తన, మోహిత, పంచమి, బృంద, తనూష, మేఘన, నవ్యశ్రీ, విద్య, దిశా, భూమిక, నిసర్గ, శ్రేయలు అద్భుతంగా ప్రదర్శించారు.

హిందూ కులాల దళితులకే రిజర్వేషన్లు అమలు చేయాలి



రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో మాట్లాడుతున్న మారెడు మోహన్‌

ఆమనగల్లు: హిందూ కులాల దళితులకు మాత్రమే ఎస్సీ రిజర్వేషన్‌ అమలు చేయాలని పలువురు దళిత సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం ఎస్సీ రిజర్వేషన్‌ పరిరక్షణ సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌ టేబుల్‌ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎస్సీ రిజర్వేషన్‌ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మారెడు మోహన్‌, ఏబీవీపీ జాతీయ మాజీ అధ్యక్షుడు మురళీమనోహర్‌, జాతీయ కోశాధికారి బాల్‌రాం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల నర్సింహులు హాజరయ్యారు. సమితి జిల్లా అధ్యక్షుడు జునుకుంట్ల భాస్కర్‌ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో ఎస్సీ రిజర్వేషన్లపై వివిధ దళిత సంఘాలు, ప్రజాసంఘాలు, హిందూ సంఘాల నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. మతం మారిన దళితులకు, ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వాలా? వద్దా? అనే విషయంపై కేంద్రం.. బాలకిషన్‌ కమిషన్‌ ఏర్పాటు చేసిందన్నారు. ఈ కమిషన్‌ ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకుండా పాత రిజర్వేషన్‌ విధానాలను కొనసాగించేలా నివేదిక ఇవ్వాలని పలువురు అభిప్రాయపడ్డారు. కులంలేని మతాలలోకి మారిన వారు కులాధారమైన రిజర్వేషన్లు తమకు కావాలని అడగడం చట్ట విరుద్ధమని వారు అన్నారు. కుల వ్యవస్థను దూరం చేసుకుని జరుగుతున్న మత మార్పిడీలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని వారు అభిప్రయాన్ని వ్యక్తం చేశారు. సమావేశంలో వివిధ దళిత, ప్రజా, హిందూ సంఘాల నాయకులు, యువకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌ అప్‌డేట్‌ తప్పనిసరి

- కార్డు పొంది పదేళ్లు దాటితే అప్‌డేట్‌ చేసుకోవాల్సిందే
- ఉచిత సేవలకు ఈ నెల 14 వరకు గడువు

దౌల్తాబాద్‌: ప్రభుత్వ శాఖల్లో ఏ చిన్న పనికైనా ఆధార్‌కార్డును ప్రమాణికంగా తీసుకుంటున్నారు. ఆస్తుల క్రయవిక్రయాలు బ్యాంకు రుణాలు, ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు.. విద్యాపరంగా సీట్లు పొందాలన్నా ఆధారే కీలకంగా మారింది. ఆధార్‌ కార్డులను జారీని 2010లో ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం మరోమారు ఆధార్‌కార్డు అప్‌డేట్‌ చేసుకునేందుకు ఉచితంగా ఆవకాశం కల్పించింది. ఈ సేవలను వినియోగించుకునేందుకు జూన్‌14వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉంది. ఆధార్‌కార్డును నిర్ణీత వ్యవధిలో అప్‌డేట్‌ చేసుకోనట్లయితే భవిష్యత్తులో కార్డు సస్పెండ్‌ అయ్యే అవకాశం ఉంది.

సంక్షేమ పథకాలకు...

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు పొందాలంటే ఆధార్‌ అనుసంధానం తప్పనిసరి చేశారు. ఈ నేపథ్యంలో లబ్దిదారుల ఆధార్‌ వివరాలు సక్రమంగా ఉన్నాయా లేదా అని అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రధానంగా పదేళ్ల క్రితం ఆధార్‌ తీసుకోవడం ఆ సమయంలో సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించకపోవడం వేలిముద్రలు అరిగిపోవడం వంటి కారణాలతో పథకాలకు అర్హులైన వారు దూరమవుతున్నారు. ఒకరి ఆధార్‌కు బదులుగా మరొకరి ఆధార్‌ నంబర్‌ నమోదు కావడం వంటి సమస్యలు కూడా ఉన్నాయి.

చిన్నారులకు విధిగా..

నెలల వయసున్న వారి నుంచి 5 ఏళ్ళలోపు చిన్నారులకు విధిగా ఆధార్‌ నమోదు చేయించాలి. వీరికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే అన్ని రకాల వసతులకు ఆధార్‌ తప్పనిసరి చేయడమే ఇందుకు కారణం. ఆధార్‌ లేనివారికి పూర్తిస్థాయి పౌష్టికాహారం అందించే పరిస్థితి నెలకొంది.



సెంటర్లో ఆధార్‌ నమోదు

పెద్దల్లో వీరికి ...

2010నుంచి 2018 వరకు ఆధార్‌ నమోదుదారుకి కార్డుపై పేరుతో పాటు తండ్రి, భర్త అనే విధంగా వారి మధ్య ఉన్న బంధుత్వం ముద్రితమై ఉంటుంది. 2018 తరువాత వాటిని తొలగించి కేవలం కేరాఫ్‌ పడేలా సమీకరించుకోవాలి. 2009లో ఆధార్‌ ప్రారంభమైన సమయంలో వ్యక్తిగత వివరాలు నమోదు చేయలేదు. ప్రస్తుతం ఆ వివరాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు పొందుపరుస్తూ సమీకరణ చేసుకోవాలి.

పిడుగుపాటుకు గేదె మృతి

ఆమనగల్లు: మండల పరిధిలోని రాంనుంతల గ్రామం పెద్దతండాలో పిడుగుపాటుకు గేదె మృతి చెందింది. జాన్యకు చెందిన గేదెను సమీపంలోని పొలం వద్ద చెట్టుకు కట్టి ఉంచిన సమయంలో ఆదివారం సాయంత్రం పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ దాదాపు రూ.90 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. సర్పంచ్‌ సోన శ్రీనునాయక్‌ సందర్శించి బాధిత రైతు జాన్యను ఓదార్చారు. ప్రభుత్వపరంగా సాయం అందేలాచూస్తామని భరోసా ఇచ్చారు.

నకిలీ ఐస్‌క్రీం తయారీ కేంద్రంపై దాడి

చైతన్యపురి: నకిలీ ఐస్‌క్రీం తయారు చేస్తున్న ఓ ఇంటిపై ఎల్‌బీనగర్‌ ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గడ్డిఅన్నారం డివిజన్‌ కోదండరాంనగర్‌ కాలనీలోని ఓ ఇంట్లో ఎటువంటి అనుమతులు లేకుండా ఐస్‌ క్యూబ్‌ పేరుతో ఐస్‌క్రీం తయారు చేస్తునట్లు సమాచారం అందింది. దీంతో ఎస్‌ఓటీ పోలీసులు ఆదివారం రాత్రి ఆ ఇంటిపై దాడి చేశారు. నిర్వాహకుడు భిక్షపతిని అదుపులోకి తీసుకున్నారు. అపరిశుభ్ర వాతావరణంలో, కాలపరిమితి తీరిన ఫ్లేవర్స్‌తో ఐస్‌క్రీం తయారు చేస్తున్నట్లు గుర్తించారు. అలాగే యూనిట్‌కు ఎలాంటి అనుమతులు కూడా లేనట్లు విచారణలో తేలింది. భారీ ఎత్తున కాలం చెల్లిన ఫ్లేవర్స్‌, ఇతర ముడిసరుకుని స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం సరూర్‌నగర్‌ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో దర్జాగా భూకబ్జాలు

శంషాబాద్‌ రూరల్‌: వేలాది గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం భూకబ్జాలకు పాల్పడుతోందని, లేదంటే ప్రజల పట్టా భూములను ప్రైవేటు వ్యక్తులకు దోచిపెడుతుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌.ఎస్‌.ప్రవీణ్‌ కుమార్‌ మండిపడ్డారు. మండలంలోని ఘాంసిమియాగూడ భూముల బాధిత రైతులకు అండగా ఆయన ఆదివారం గ్రామంలోని భూములను సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల నుంచి దౌర్జన్యంగా తీసుకున్న భూములను తిరిగి వారికి అప్పగించేందుకు బీఎస్పీ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ఏ భూమి మీద హక్కు కోసం తెలంగాణ తెచ్చుకున్నామో ఆ భూములిప్పుడు రైతుల వద్ద లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఘాంసిమియాగూడలో వందేళ్ల నుంచి సాగు చేసుకుంటున్న 90 మంది రైతులకు సంబంధించిన సుమారు 200 ఎకరాల భూములను గోల్డ్‌స్టోన్‌ కంపెనీ యజమాని ప్రసాద్‌ అన్యాయంగా లాక్కున్నారని ఆరోపించారు. బీసీ వర్గానికి చెందినవాడినని చెప్పుకుంటున్న స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ రైతుల పక్షాన ఉండి పోరాడుతారా? లేదంటే గోల్డ్‌స్టోన్‌ ప్రసాద్‌కు మద్దతు ఇస్తారా అని ప్రశ్నించారు.

దడపుట్టిస్తున్న రోడ్డు మలుపులు



ఎక్మాయి సమీపంలో ప్రమాదకరంగా రోడ్డు మలుపు



బషీరాబాద్‌-ఎక్మాయి మధ్య మలుపు

కానరాని సూచిక బోర్డులు

- ప్రమాదాల బారిన వాహనదారులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

బషీరాబాద్‌: మండలంలోని ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌ రోడ్ల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. సూచిక బోర్డులు సైతం లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మూల మలుపుల వద్ద ముళ్లచెట్లు అధికంగా ఉండడంతో వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. బషీరాబాద్‌ - ఎక్మాయి, బషీరాబాద్‌- కొత్లాపూర్‌, ఇదంర్‌చెడ్‌- అయ్యాలం, నవల్గ- నీళ్లపల్లి, నీళ్లపల్లి- మైల్వార్‌, బషీరాబాద్‌- గంగ్వార్‌ గేట్‌ మధ్యలోని రోడ్ల మార్గాలలో డేంజర్‌ టర్నింగులు ఉన్నాయి. ఈ మలుపుల వద్ద ప్రమాదాల నియంత్రణకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. వేగంగా వచ్చే వాహనాలు మలుపులను గమనించకపోవడంతో అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. వాస్తవానికి మూల మలుపుల వద్ద రేడియం స్టిక్కర్లతో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. దిశను సూచించే సూచిక బోర్డులు, స్పీడ్‌ బ్రేకర్లు, హెచ్చరికలు పెట్టాలి. కానీ ఎక్కడా కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో మలుపుల వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కనీసం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లకంచెను కూడా తొలగించడంలేదు. తాండూరు- బషీరాబాద్‌ మార్గంలో ముళ్ల కంచె రోడ్లపైకి విస్తరించాయి. దీంతో వాహనాదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.